మంత్రి సురేఖపై చర్యలు తీసుకోండి

జాతీయ మహిళా కమిషన్‌కు తుల ఉమ ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సినిమా పరిశ్రమకు చెందిన నటులపై నీచంగా మాట్లాడిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకురాలు, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ జాతీయ మహి ళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలు అసభ్యంగా, సమాజ నిర్మాణానికి హాని కలిగించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె ఇలాంటి అసంబద్ధ వ్యాఖ్యలు చేయకుండా కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కమిషన్‌కు ఫిర్యాదు లేఖ పంపించారు. మంత్రి మాటలు మహిళలపై అనవసరమైన అనుమానాలు కలిగిస్తాయని, వారి వ్యక్తిగత, వృత్తి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు మహిళలు తమ లక్ష్యాలను సాధించటంలో నీరుగారుస్తాయని వివరించారు. సురేఖ కుసంస్కార వ్యాఖ్యలు మహిళలు సమాజంలో పురోగతి సాధించడానికి ప్రతిబంధకంగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తులు బాధ్యతాయుతంగా, గౌరవప్రదంగా, ప్రోత్సాహకరంగా మాట్లాడాలి తప్ప అసంబద్ధ, నిరాధార వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. మంత్రి సురేఖ అడ్డగోలు వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

బీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కొండా సురేఖ అలా వ్యాఖ్యానించటం సరి కాదన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ హైకమాండ్ ఆమెపై తక్షణమే కఠినమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

72గంటల్లో మంత్రి రాజీనామా చేయాలి

ప్రజలు మళ్లీ కేసీఆరే కావాలంటున్నరు: కేఏ పాల్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ డిమాండ్ చేశారు. 72 గంటల్లో ఆమె రాజీనామా చేయకపోతే, తానే ఆమెపై కేసు వేస్తానని తెలిపారు. సమంత, నాగార్జున ఇంటికి వెళ్లి మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పాలని సూచించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ మాటలు చట్టవిరుద్ధమని, హత్యచేసి సారీ చెప్తే సరిపోతుందా? అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రహస్యంగా అదానీని ఎందుకు కలిశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలన వద్దు.. మళ్లీ కేసీఆరే కావాలని కోరుకుంటున్నట్టు కేఏ పాల్ పేర్కొన్నారు. హైడ్రాపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయించారే మోనని అనుమానం వ్యక్తం చేశారు.

సురేఖకు మహిళల పట్ల గౌరవం లేదు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 3: మహిళ అన్న విషయాన్ని మరిచి మంత్రి కొండా సురేఖ సభ్య సమాజం తలదించుకునేలా సినీనటి సమంతపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి సురేఖకు మహిళలపై ఏ మాత్రం గౌరవం లేదని విమర్శించారు.

‘పెద్దల’ డైరెక్షన్.. సురేఖ డైవర్షన్!

- కేటీఆర్‌పైకి కొండాను రెచ్చగొట్టిన ‘పెద్దలు’
- మూసీ, హైడ్రా డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమా?
- హద్దన్నదే లేకుండా జుగుప్సాకర వ్యాఖ్యలు
- బూమరాంగ్ కావడంతో ఆత్మరక్షణలో పెద్దలు
- సురేఖ వ్యాఖ్యలపై రాహుల్,ప్రియాక ఆరా
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్‌కు మొట్టికాయలు
- వెంటనే పీసీసీ చీఫ్ వీడియో విడుదల
- ఇప్పటికీ స్పందించని సీఎం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం వరంగల్ లేబర్‌కాలనీ జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమాజంలో ఆడపిల్ల జీవితం గురించి అనుచిత వ్యాఖ్యలు చేసి ఇలా రోడ్డు మీద వేయడం సరికాదని అన్నారు. – కాశీబుగ్గ

హైదరాబాద్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖను ‘పెద్దలు’ డైవర్షన్ పాలిటిక్స్‌కు వాడుకున్నారా? కేటీఆర్‌పైకి మంత్రిని ఎగదోస్తే మూసీ, హైడ్రా లొల్లి డైవర్షన్ అవుతుందని లెక్కలేసుకున్నారా? వీళ్ల డైవర్షన్ డ్రామా కాస్తా బూమరాంగ్ అయిందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి కేటీఆర్‌పై, అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి సురేఖ వ్యాఖ్యల వెనుక ‘పెద్దలు’ ఉన్నారనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఆమెను అడ్డంపెట్టుకొని మూసీ, హైడ్రా నష్టాన్ని పక్కదారి పట్టించాలని పక్కా ప్లాన్ వేసినట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే మంత్రి కొండాను రెచ్చగొట్టి మాట్లాడించారనే ప్రచారం జోరుగా జరుగుతున్నది. ‘పెద్దలు’ చెప్పారనే ఆనందంలో రెచ్చిపోయిన సురేఖ హద్దులు మీరి నోటికి పనిచెప్పారు. హద్దు అదుపు లేకుండా అక్కినేని కుటుంబంపై, మహిళలపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారు. ఆమె వ్యాఖ్యలు అప్పటికే జనాల్లోకి వెళ్లడం, పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పరిస్థితి చేయిదాటిపోయిందని గ్రహించిన పెద్దలు నష్టనివారణ చర్యలకు దిగినట్టు తెలిసింది.

రెచ్చగొట్టి వదిలేసిన ‘పెద్దలు’

బుధవారం గాంధీ జయంతి సందర్భంగా సీఎం, మంత్రులు బాపూఘాట్ వద్ద మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. మంత్రి కొండా సురేఖ మాత్రం మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఇవి మీడియాలో హైలైట్ కావడంతో ‘పెద్దల’కు ఓ ఆలోచన తట్టింది. మాజీ మంత్రి కేటీఆర్‌పై విమర్శల తీవ్రత పెంచితే మూసీ, హైడ్రా వివాదం పక్కదారి పడుతుందని ప్లాన్ వేశారు. దీంట్లో భాగంగానే కొండా సురేఖను రెచ్చగొట్టినట్టుగా తెలిసింది. బాపూఘాట్ నుంచి గాంధీభవన్‌కు వచ్చిన ఆమెకు పెద్దలు ఫోన్ చేసి కేటీఆర్‌పై విమర్శల దాడి పెంచాలని సూచించినట్టు తెలిసింది. ఓవైపు వ్యక్తిగత ఆక్రోశం.. మరోవైపు పెద్దల అండ, ఆదేశం.. ఇంకేముంది సురేఖ రెచ్చిపోయారు. మీడియాతో ముందు వెనక చూసుకోకుండా, ఏం మాట్లాడుతున్నారో కూడా ఆలోచించకుండా అక్కినేని కుటుంబంపై విపరీత వ్యాఖ్యలు చేశారు.

‘కొండా’పై చర్యలకు వెనకాడొద్దు: అధిష్ఠానం

నాగార్జున కుటుంబంపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలను అధిష్ఠానం పెద్దలు తీవ్రంగా పరిగణించినట్టు తెలిసింది. అంతకు ముందు ‘ఫైర్‌బ్రాండ్’గా పేరున్న ఓ మహిళా నేత ఈ ఘటనపై నేరుగా అధిష్ఠానం పెద్దలకే ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అసలు ఈ వ్యాఖ్యలేంటి? ఈ పాలనేంటి అని నిలదీసినట్టుగా తెలిసింది. అక్కినేని కుటుంబం చాలా పెద్దదని, దక్షిణ భారతదేశంలో వాళ్ల ప్రభావం ఉంటుందని చెప్పినట్టుగా తెలిసింది. అలాంటి కుటుంబంపై మహిళా మంత్రి ఇంత నీచంగా మాట్లాడటంపై పార్టీ పరువు పోతుందని, వాళ్లను కట్టడి చేస్తారా? లేదా? అని నిలదీసినట్టు తెలిసింది. మీ నుంచి అవుతదా? లేదా? అంటూ నేరుగా ప్రశ్నించినట్టు తెలిసింది. దీంతో ఏం జరిగిందనే అంశంపై రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్ ఆరా తీసినట్టు సమాచారం. ఇందులో భాగంగానే అక్కినేని అమలకు ప్రియాంకగాంధీ ఫోన్ చేసినట్టుగా తెలిసింది. జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేసిన ఆమె.. బాధపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారట. ఈ వ్యవహారంపై తేల్చాలని కేసీ వేణుగోపాల్‌ను ఆదేశించినట్టుగా తెలిసింది. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఫోన్ చేసిన వేణుగోపాల్.. ఈ వ్యవహారంపై తలంటినట్టుగా తెలిసింది. పూర్తి వివరాలను తెలుసుకున్న అధిష్ఠానం పెద్దలు మంత్రి కొండా సురేఖ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. బాధ్యత గల పదవిలో ఉంటూ, పైగా మహిళా మంత్రిగా ఉంటూ సాటి మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏంటని నిలదీసినట్టు తెలిసింది. మంత్రులను అదుపులో పెట్టలేరా? అంటూ ఇటు సీఎం రేవంత్‌రెడ్డిని, అటు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. ఇప్పటికే హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతతో పార్టీకి జరిగిన నష్టం చాలదన్నట్టుగా ఇప్పుడు ఈ కొత్త తలనొప్పి అవసరమా అని ప్రశ్నించినట్టుగా తెలిసింది. మీ వ్యవహారంతో రాష్ట్రంలో పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నట్టు నివేదిక అందిందని మందలించినట్టు తెలిసింది. ఇప్పటికే జరిగిన నష్టం చాలని, ఇకపై ఈ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆదేశించినట్టు తెలిసింది. మొత్తం ఘటనపై పార్టీ తరుపున వివరణ ఇవ్వాల్సిందిగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదేశించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో ఆయన గురువారం ఉదయం ఈ ఘటనను ఖండిస్తూ వీడియోను విడుదల చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, మంత్రులను అదుపులో పెట్టేందుకు అవసరమైతే సురేఖపై చర్యలకు కూడా వెనకాడొద్దని ఆదేశించినట్టుగా తెలిసింది.

‘కొండా’కు ఛీత్కరింపులు

సినీ నటుడు నాగార్జున కుటుంబాన్ని అవమానించేలా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో కలవరం సృష్టిస్తున్నాయి. ఆమె చేసిన జుగుప్సాకరమైన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినీ ప్రముఖులు, రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ట్విటర్‌లో పోస్టులు పెడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన పార్టీ అధిష్ఠానం పెద్దలు నష్టనివారణ చర్యలు చేపట్టినట్టుగా తెలిసింది. నాగార్జున కుటుంబంపై, మహిళలపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలపై సొంత పార్టీలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీ నేతలే ఆమె వ్యాఖ్యల్ని ఛీత్కరిస్తున్నారు. ‘నా 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎవరూ, ఎప్పుడు ఇంత దిగజారి మాట్లాడింది చూడలేదు. ఆమె మా పార్టీ మంత్రి అని చెప్పుకోవడానికి కూడా నాకు సిగ్గుగా ఉంది.’ అని సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. ఇదే అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతున్నది.

రేవంత్ మౌనం వెనుక మర్మమేమిటి?

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై అన్ని వైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం మౌనాన్ని పాటిస్తున్నారు. ఇంత దుమారం చెలరేగినా ఆయన మాట కూడా మాట్లాడటం లేదు. మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు కనీసం ప్రకటన కూడా చేయలేదు. రేవంత్ మౌనానికి గల కారణం ఏమిటన్న చర్చ జరుగుతున్నది. అనేక అనుమానాలూ వ్యక్తం అవుతున్నాయి. హైడ్రా, మూసీ వివాదాలను పక్కదారి పట్టించేందుకు ఆయనే డైవర్షన్ పాలి‘ట్రిక్స్’కు తెరతీశారని పలు వర్గాల నుంచి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అందులో భాగంగానే మంత్రి కొండా సురేఖతో ఈ ఘాటు వ్యాఖ్యలు చేయించారన్న అనుమానం వస్తున్నది. ‘పెద్దల’ అనుమతి లేకుండా ప్రముఖుల కుటుంబంపై ఇలాంటి వ్యాఖ్యలు చేసేందుకు ఓ మంత్రి సాహసిస్తారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే కొండా వ్యాఖ్యలు అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కొండాపై నాగార్జున పరువు నష్టం దావా

- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు
- సెక్షన్ 356 కింద చర్యలు తీసుకోవాలని వినతి
- పిటిషన్‌కు మంత్రివ్యాఖ్యల వార్తాక్లిప్పింగులు జత

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో గురువారం అక్కినేని నాగార్జున పరువు నష్టం దావా వేశారు. సెక్షన్ 356 బీఎన్ఎస్ కింద చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. మంత్రి సురేఖ మీడియా సమావేశంలో మాట్లాడిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో, టీవీల్లో, పత్రికల్లో ప్రధానంగా వచ్చాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ కథనాల క్లిప్పింగులను కోర్టుకు సమర్పించారు. మంత్రి వ్యాఖ్యలతో తాను షాక్‌కు గురయ్యానని, అక్కినేని కుటుంబానికి ఉన్న పేరు ప్రతిష్ఠకు భంగం కలిగించారని పిటిషన్‌లో వివరించారు. కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని, కన్వెన్షన్‌హాల్ కూల్చడానికి, మంత్రి వ్యాఖ్యలకు ఎలాంటి సంబంధంలేదని తెలిపారు. కన్వెన్షన్ సెంటర్ తనకు (నాగార్జున) చెందినదని, నాగచైతన్య–సమంత విడాకులకు లింక్ లేదని, కేటీఆర్‌పై నిందారోపణలు చేసి అక్కినేని కుటుంబానికి ఉన్న పరువుకు నష్టం కలిగించేలా ఆమె వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. జాతీయ చానళ్లు కూడా మంత్రి మీడియా సమావేశాన్ని ప్రసారం చేశాయని తెలిపారు. బిగ్ బాస్ హోస్ట్‌గా, సినిమా హీరోగా, నిర్మాతగా తనకు, తమ కుటుంబానికి ఉన్న పేరు ప్రతిష్ఠలను పాడుచేసేలా మంత్రి వ్యాఖ్యలు ఉన్నాయని, కావాలని ఆమె తమ కుటుంబాన్ని టార్గెట్ చేసి మాట్లాడారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని, కేసు నమోదు చేసి వాస్తవాలను వెలికి తీయాలని కోర్టును కోరారు.

అయినా మంత్రి మారలేదు

మొదటిపేజీ తరువాయి...

ఆమె గురువారం ఉదయం సంజాయిషీ ఇచ్చుకొని తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. కేటీఆర్‌పై మాట్లాడుతూ భావోద్వేగానికి లోనై అనుకోకుండా ఓ కుటుంబంపై నోరుజారినట్టు తెలిపారు. తనకు ఎవరిపైనా వ్యక్తిగత కోపం, ద్వేషం లేదని పేర్కొన్నారు. తన వ్యాఖ్యల తర్వాత అక్కినేని కుటుంబం ట్వీట్ చూసి తాను కూడా బాధపడినట్టు చెప్పారు. ఏ విషయంలో అయితే తాను బాధపడ్డానో అదే విషయంలో ఇంకొకరిని నొప్పించానని భావించి ఆ వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ సంజాయిషీ ఇచ్చి గంటలు కూడా పూర్తి కాకముందే సాయంత్రం మళ్లీ నాగచైతన్య, సమంతల విడాకులపై పిచ్చి ప్రేలాపనలు చేశారు. నాగచైతన్య, సమంత ఎందుకు విడాకులు తీసుకున్నారనే విషయం ప్రపంచానికి తెలియదని, వారి కుటుంబం నుంచి కూడా దీనిపై ఏమీ చెప్పలేదని పేర్కొన్నారు. సినీ ఇండస్ట్రీ నుంచి వచ్చిన సమాచారంతో తాను ఆ వ్యాఖ్యలు చేసినట్టు చెప్పారు. ‘కోపం వచ్చింది. కోపంలో మాట్లాడాల్సి వచ్చింది.. మాట్లాడిన’ అని చెప్పడం గమనార్హం. ఆమె మరోసారి ఈ వ్యాఖ్యలు చేయడంపై ప్రజల నుంచి రెట్టింపు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఓ మంత్రా అంటూ తిట్టిపోస్తున్నారు. మతి భ్రమించి మాట్లాడుతున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను నిరసిస్తూ భద్రాద్రి జిల్లా ఇల్లెందులోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద గురువారం ఆమె దిష్టిబొమ్మను బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు, మహిళా కౌన్సిలర్లు దహనం చేశారు. నటి సమంత గురించి తప్పుడు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని మండిపడ్డారు. – ఇల్లెందు రూరల్

హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని, పెద్ది

కొండా సురేఖది నీచ రాజకీయం

- కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం

హనుమకొండ, అక్టోబర్ 3: మంత్రి కొండా సురేఖది నీచ రాజకీయమని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజమెత్తారు. కేటీఆర్‌పై మంత్రి చేసిన అసత్య ఆరోపణల నేపథ్యంలో గురువారం మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపనేని నరేందర్‌తో కలిసి దాస్యం మీడియాతో మాట్లాడారు. మంత్రి సురేఖ వెంటనే కేటీఆర్‌కు బేషరతు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తోటి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి కేటీఆర్‌పైకి నెట్టడం సరికాదని, ఆమె మాటలను మహిళా లోకమంతా ఖండిస్తున్నదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ మంత్రి సురేఖ అనాలోచిత మాటలకు మహిళలు బాధపడుతున్నారని అన్నారు.

కొండా సురేఖ క్షమాపణ చెప్పాల్సిందే

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి, అక్టోబర్ 3 : అధికారంలో ఉన్నామనే అహంకారంతో సినీనటి సమంత వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గవర్నర్‌ను కోరారు. గురువారం ఆయన నల్లగొండ జిల్లా కేతేపల్లిలో మీడియాతో మాట్లాడారు. సురేఖ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని సమంతతోపాటు మాజీ మంత్రి కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైఎస్ షర్మిల ‘ఇష్యూ’లో హుందాగా కేటీఆర్!

- నాడు షర్మిల-ప్రభాస్ మధ్య ట్రోలింగ్‌లపై కేటీఆర్ ఆగ్రహం
- తక్షణం చర్యలు తీసుకోవాలని నాటి సీపీలకు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): మహిళలు, ఆడబిడ్డల పట్ల మాజీ మంత్రి కేటీఆర్‌కు ఉన్న గౌరవ మర్యాదలను కాంగ్రెస్ ప్రభుత్వం చూడలేకపోతున్నది. మహిళల సమస్యలు, వాటిని పరిష్కరించే అంశాలపై ఆయన ప్రదర్శించే హుందాతనం కాంగ్రెస్ నేతల కంటికి కనిపించటం లేదు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, నటుడు ప్రభాస్‌పై గతంలో టీడీపీకి చెందిన కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారు. 2014లో, 2019లో దారుణ విమర్శలు చేశారు. ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని 2014, 2019లో కేటీఆర్ స్పందించారు. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను సోషల్ మీడియాలోకి లాగొద్దని హెచ్చరించారు. దోషులకు శిక్షపడేలా చేస్తామని, అవసరమైతే చట్టాల్లో మార్పులు సైతం తీసుకురావడానికి వెనుకాడబోమని కేటీఆర్ 2014లోనే చెప్పారు. నాడు తనకు సమాచారం అందిన వెంటనే హైదరాబాద్ పోలీసు కమిషనర్‌తో మాట్లాడినట్టు చెప్పారు. 2019 జనవరిలోనూ అదే తరహా విష ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకున్న నేపథ్యంలో కేసీఆర్ కుటుంబం నుంచి కేటీఆర్, కవిత స్పందించారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాటి హైదరాబాద్ సీపీ అంజనీకుమార్‌ను ఆదేశించారు. అప్పటికే వైఎస్ షర్మిల దంపతులు అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేయటంతో హైదరాబాద్ సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీస్ విభాగం స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టింది. అడిషనల్ డీసీపీ రఘువీర్ నేతృత్వంలోని ప్రత్యేక పోలీసు బృందం పలు కోణాల్లో కేసును ఇన్వెస్టిగేట్ చేసి, కొందరిని అరెస్టు చేసింది. అప్పటికి ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఉండగా.. తనకు ఏపీ పోలీసులపై నమ్మకం లేదని, అందుకే హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశానని వైఎస్ షర్మిల చెప్పారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారంలో టీడీపీకి భాగస్వామ్యం ఉందని ఆమె ఆరోపించారు. అప్పట్లో ఆమె చేసిన ఆరోపణలు రాజకీయంగా సంచలనం రేపాయి.

అక్కినేని కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కృష్ణానగర్‌లో నిరసన తెలుపుతున్న అక్కినేని అభిమానులు

పీకే.. మాట్లాడరేం!

- కొండాసురేఖ వ్యాఖ్యలపై స్పందించని పవన్ కల్యాణ్
- సినీ నటుడై ఉండీ మాట్లాడకపోవడంపై విమర్శలు
- ఎన్టీఆర్ మినహా స్పందించని నందమూరి నటులు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): అక్కినేని కుటుంబంపైనా, నటి సమంత పైనా అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై సినీలోకం భగ్గుమంటున్నది. బుధవారం ఆమె వ్యాఖ్యలు చేసిన తర్వాత ఒక్కొక్కటిగా మొదలైన విమర్శలు గురువారం నాటికీ ఆగలేదు. దాదాపుగా టాలీవుడ్ ప్రముఖులందరూ ఆ ఇష్యూపై స్పందించారు. తమిళ, మలయాళ ఇండస్ట్రీలతోపాటు బాలీవుడ్ సినీ తారలు సురేఖ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సినీ తారల జోలికి రావొద్దంటూ గట్టిగానే సమాధానమిచ్చారు. ‘ఫిల్మ్ ఇండస్ట్రీ విల్ నాట్ టాలరేట్ (సినీరంగం ఏమాత్రం ఉపేక్షించదు) అనే ట్యాగ్‌లైన్‌తో నటీనటులు, దర్శకులు ప్రకటనలు విడుదల చేశారు. తెలుగునాట ఇంత రచ్చ జరుగుతుంటే.. ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ సినీనటుడు పవన్ కల్యాణ్ మాత్రం ఈ ఘటనపై స్పందించలేదు. చిరంజీవితోపాటు మెగా ఫ్యామిలీ తారలందరూ స్పందించినా.. పవన్ కళ్యాణ్ మాట్లాడుతారేమోనని తెలంగాణలోని ఆయన అభిమానులు మరీ ముఖ్యంగా మహిళా అభిమానులు ఎదురుచూశారు. అత్తారింటికి దారేది లాంటి చిత్రాల్లో తన సహనటిగా ఉన్న సమంతపై వాఖ్యలను ఆయన ఖండిస్తారేమోనని వారంతా ఆశించారు. హైడ్రా కూల్చివేతలపై స్పందించినట్టుగానే దీనిపైనా స్పందిస్తారని అందరూ భావించారు. సినీతారల వ్యక్తిత్వహననం చేస్తూ కాంగ్రెస్ మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ప్రత్యర్థి పార్టీ నేతగా కాకపోయినా.. ఫిల్మ్ సెలబ్రిటీగానైనా ఆయన స్పందించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గురువారం తిరుపతిలో జరిగిన వారాహి సభలో నైనా ఆయన ఈ అంశంపై మాటవరసకైనా మాట్లాడుతారేమోనని మీడియా వర్గాలు సైతం భావించాయి. సాధారణంగా మహిళా అభ్యున్నతి, గౌరవమర్యాదల గురించి తీవ్ర ఉపన్యాసాలిచ్చే పవన్.. అక్కడా ఒక్క ముక్క మాట్లాడలేదు. ఆయన మౌనంపై రక రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

స్పందించని నందమూరి కుటుంబం

కొండా సురేఖ వ్యాఖ్యలపై బుధవారం రోజే జూనియర్ ఎన్టీఆర్ ఘాటుగా స్పందించారు. నేరుగా మంత్రి పేరును ప్రస్తావిస్తూ దీటుగా సమాధానమిచ్చారు. అయితే నందమూరి కుటుంబానికి నిజమైన వారసులుగా చెప్పుకునే ‘యువరత్న’ బాలకృష్ణ గానీ, ఆయన కుటుంబానికి చెందిన నటులుగానీ సురేఖ వ్యాఖ్యలను ఎక్కడా ఖండించలేదు. చిన్న ప్రకటన విడుదల చేసినా సరిపోయేదని, కానీ ఆయన ఏఎన్నార్ కుటుంబంపై బురద చల్లించే వ్యాఖ్యలపై స్పందించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. బాబు–రేవంత్ సఖ్యత వల్లే బాలకృష్ణ స్పందించలేదా? లేక ఏఎన్నార్ కుటుంబంతో ఉన్న గ్యాప్ కారణంగానే మాట్లాడలేదా? లేక స్థానిక ప్రభుత్వంతో ఎందుకు వచ్చిన చిక్కులని భావించారా? అనేది తెలియడం లేదని సినీ విశ్లేషకులు ఒకరు వ్యాఖ్యానించారు.

- మంత్రి కొండాపై పోలీసులకు